

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం ఇస్తాళాపురంలో నీళ్లు రాక ఎండుతున్న వరి పొలం

# కాళేశ్వరం నీళ్లియ్యక ఆగం చేసిండ్రు

**సూర్యాపేటలో ఎండుతున్న వేలాది ఎకరాలు.. సర్కార్ తీరుపై రైతుల మండిపాటు**

సూర్యాపేట, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లా పరిధిలోని శ్రీరాంసాగర్ ఫేజ్-2 ఆయకట్టు రైతులు ఏడేండ్ల తరువాత కరువును ఎదుర్కొంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లు రావడంతో సూర్యాపేట జిల్లాలోని శ్రీరాంసాగర్ ఆయకట్టుకు ఎలాంటి అడ్డంకులూ లేకుండా ఇంచు భూమి వదలకుండా రైతులు వరి పండించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి నీళ్ల కోసం అరిగోస పడుతున్నారు. ఈ యాసంగి వరి నాట్లు వేసిన 20 రోజుల నుంచే ఎస్సారెస్పీ కాల్వల్లో నీళ్లు రావడం లేదని, నాటేసిన వరి ఆదిలోనే ఎండిపోతుందని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఎస్సారెస్పీ కింద సూర్యాపేట జిల్లాలో 2.95 లక్షల ఎకరాల్లో వరి ఆయకట్టు ఉండగా, నీళ్లు రావనే అనుమానంతో 2.50 లక్షల్లో నాట్లు పడ్డాయి. చాలాచోట్ల వానకాలంలో కురిసిన వర్షాలతో బావులు, బోర్లలో నీళ్లు ఉండటంతో నాట్లు వేసినప్పటికీ పంట చేతికి వచ్చే సమయానికి నీళ్లు అందకపోవచ్చని ఇరిగేషన్ శాఖ అధికారుల ద్వారా తెలిసింది. ప్రస్తుతం నీటి నిల్వలు తక్కువ ఉన్నందున పూర్తిస్థాయిలో ఇవ్వడం కుదరని అధికారులు పేర్కొన్నట్టు సమాచారం. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ యాసంగిలో ఎస్సారెస్పీ ఆయకట్టు కింద 50 శాతం వరి ఎండిపోయే ప్రమాదం కనిపిస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## 3.94 లక్షల మందికి రైతుభరోసాలో కోత

- గతంతో పోల్చితే భారీగా తగ్గిన రైతుల సంఖ్య
- వ్యవసాయ శాఖ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): రైతు భరోసాలో కోతలు నిజమేనని వ్యవసాయ శాఖ అంగీకరించింది. గత వానకాలంతో బీఆర్ఎస్ ఇచ్చిన దానితో పోల్చితే ఈ యాసంగిలో ఎకరంలోపు 3,94,232 మంది రైతులకు కోత పెట్టినట్టు వెల్లడించింది. 'రైతులు తగ్గారు.. భూమి పెరిగింది' శీర్షికన గురువారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి వివరణ ఇచ్చారు. గత వానకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరం వరకు 22,55,181 మంది రైతులకు చెందిన 12,85,147 ఎకరాలకు రూ.642.57 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. ఈ యాసంగిలో ప్రస్తుతం ఎకరం వరకు 18,60,949 మంది రైతులకు చెందిన 12,21,820 ఎకరాలకు రూ. 610.91 కోట్ల రైతు భరోసా అందించినట్లు పేర్కొన్నారు. గతంతో పోల్చితే ఈ యాసంగిలో సర్కారు 3,94,232 మంది రైతులకు కోత విధించగా, 63,327 ఎకరాలకు కోత పెట్టింది.



గురువారం పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలోని సింగిల్ విండో వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

# యూరియా కోసం రైతుల తిప్పలు

**సహకార సంఘాల వద్ద క్యూ.. నిల్వలు లేక అన్నదాతల ఇబ్బందులు**

జూలపల్లి, ఫిబ్రవరి 6 : యూరియా కోసం రైతులు గంటల తరబడి లైన్లలో నిలబడి పడిగాపులు కాస్తున్నారు. సరిపడా యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరిపతి సంఘం పరిధిలో పెద్దాపూర్, కుమ్మరికుంట, కోనరావుపేట, జూలపల్లి గ్రామాలున్నాయి. యూరియా వచ్చిందని తెలిసి గురువారం విండో కార్యాలయం వద్ద 'క్యూ' కట్టారు. ఎరువుల కోసం గంటన్నరసేపు ఎదురు చూశారు. ఒక్కో రైతుకు 4 బస్తాలు పంపిణీ చేయగా, 10 ఎకరాల పైనున్న పంటలకు అరకొర యూరియా ఎలా సరిపోతుందని రైతులు ప్రశ్నించారు. కొంతమంది రైతులకు అందకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు.

### ఇబ్బందులు పడుతున్నం



పంటలకు సరిపడా యూరియా అందక ఇబ్బందులు పడుతున్నం. మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి. బస్తాల కోసం లైన్‌లో నిలబడి ఎదురు చూస్తున్నం. రైతులకు అందుబాటులో యూరియా నిల్వలు ఉండడం లేదు. యూరియా కోసం వెళ్లి రావడంతో వ్యవసాయ పనులు కూడా చేసుకోలేకపోతున్నం. యూరియా నిల్వలు ఉండేలా ఏర్పాటు చేయాలి.

**- కొత్త శ్రీధర్, రైతు, కుమ్మరికుంట**



మహదేవపూర్ సమీపంలో నెర్రలు బారిన ఎర్ర చెరువు

# యాసంగి ఎండుడేనా?

- పడిపోతున్న భూగర్భ జలాలు
- ఎండిన మానేరు.. చలివాగు
- వరి మొదట్లోనే రైతన్న వెతలు
- నీళ్ల కోసం కాళేశ్వరాన్ని గుర్తుచేస్తున్న అన్నదాతలు

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. యాసంగి ప్రారంభంలోనే సాగు నీటి సమస్య మొదలైంది. భూగర్భ జలాలు అడుగంటుతుండటం, చెరువుల్లో నీటి మట్టం తగ్గడం.. బోర్లపై ఆశలు సన్నగిల్లడం.. మానేరు, చలివాగు ఎండిపోవడం తదితర కారణాలతో అన్నదాతల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. రైతులు ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులను గుర్తుచేసుకుంటున్నారు. మరో నెల రోజులు ఇలాగే ఉంటే అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారే అవకాశాలున్నాయి. గత యాసంగిని పోల్చితే ప్రస్తుతం 0.40 లోతుల్లోకి భూగర్భ జలాలు అడుగంటాయి. నిరుడు ఇదే సమయంలో సైతం ఇంతగా సాగునీటి సమస్య తలెత్తలేదు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టడంతో అన్నదాతల ఆక్రందనలు ప్రారంభమయ్యాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని రైతులు కాళేశ్వరం ప్రాజెక్టును గుర్తుచేసుకుంటున్నారు. కాళేశ్వరం వల్ల భూగర్భ జలాలు పెరిగినట్టు చెప్తున్నారు.

# సాగుకు ముంచుకొస్తున్న ముప్పు!

## కృష్ణా జలాలను తరలించుకుపోతున్న ఏపీ

**ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని రేవంత్ సర్కారు.. పాలమూరులో యాసంగి ప్రశ్నార్థకం**

కొల్లాపూర్, ఫిబ్రవరి 6: రైతాంగానికి అతి ముఖ్యమైన మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే నెలాఖరు నాటికి ఎంజీకేఎల్ఐ కింద సాగైన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నది. అంతేకాదు, గత సోమవారం నాటికి శ్రీశైలం నీటిమట్టం 852 అడుగులుగా నమోదవడంతో విద్యుత్తు ఉత్పత్తి కోసం కూడా ఏపీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొన్నది.

### యాసంగి సాగు కోసం నిరీక్షణ

ఎంజీకేఎల్ఐ పరిధిలో రెండు సీజన్లలో 4.50 లక్షల ఎకరాలు సాగవుతాయి. ప్రస్తుత యాసంగిలో దాదాపు 2 లక్షల ఎకరాల్లో వరి, వేరుశనగ, మామిడి, ఇతర పంటలు సాగయ్యాయి. ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఎంజీకేఎల్ఐలో స్టాండ్ బై మోటర్‌తో కలిపి మొత్తం ఐదు మోటర్లు ఉన్నాయి. నెల రోజులుగా మూడు మోటర్లను ఏకధాటిగా రన్ చేస్తున్నారు. నాలుగో మోటర్ అందుబాటులో లేకపోవడంతో మన వాటాను సక్రమంగా వినియోగించుకునే అవకాశం లేకుండాపోయింది. రేవంత్ సర్కార్ పట్టింపులేని తనంతో చివరి ఆయకట్టుకు నీళ్లు అందడం కష్టంగా మారింది.



కృష్ణానది నుంచి ఎంజీకేఎల్ఐ పంపింగ్‌కు నీటిని అందించే కాల్వలో తగ్గిన నీరు

### ఎకరా ఎండినా ప్రభుత్వానిదే బాధ్యత



ఆంధ్రా ప్రాజెక్టుల ద్వారా కృష్ణా జలాల దోపిడీ జరుగుతున్నది. ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో ఎంజీకేఎల్ఐకి కృష్ణా నీళ్లు అందడం కష్టతరంగా మారుతున్నది. కేఎల్ఐ కింద ఎకరా ఎండినా రేవంత్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ప్రత్యామ్నాయం మార్గాల ద్వారా సాగునీటి ఇబ్బందులు లేకుండాచూడాలి.

**- బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే**

## గుండెపగిలిన రైతు

మొదటిపేజీ తరువాయి...

కోసం చేసిన అప్పులు అధికం కావడంతో వాటిని తీర్చాలనే ఉద్దేశంతో గజ్వేల్‌లో కూలి పనులు చేసేవాడు. రోజురోజుకు అప్పులు పెరుగుతుండటంతో పిల్లలను ఎలా చదివించాలో తెలియక కుమిలిపోయాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన నాగరాజు బుధవారం రాత్రి అందరు నిద్రపోయిన తరువాత తన పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం పొలం వద్దకు వెళ్లిన రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నాగరాజుకు భార్య రాజమణి, ఇద్దరు కుమారులు పవన్ కల్యాణ్, రాజు ఉన్నారు.

### రాగిబావి గ్రామంలో రైతు అశోక్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం రాగిబావి గ్రామానికి చెందిన పెసరు అశోక్‌రెడ్డి (54) 3 ఎకరాల్లో వరి సాగు చేశాడు. ప్రభుత్వ పెట్టుబడి సాయం వస్తుందన్న ఆశతో రూ.2 లక్షలు అప్పు తెచ్చాడు. పెట్టుబడి సాయం అందక అప్పుల భారమయ్యాయి. ఎండలు ముదురుతుండటంతో బోరు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. సాగు నీళ్లు అందక వరి ఎండి పోతున్నది. అప్పుల ఎలా తీర్చాలో తెలియక అశోక్‌రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన ఆయన మద్యంలోనే క్రిమిసంహారక మందు కలుపుకొని తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు అశోక్‌రెడ్డిని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మరణించాడు.

## మేడిగడ్డ కేసులో కేటీఆర్ బెయిల్ పొడిగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఈ నెల 12 వరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్టు చేయరాదని హైకోర్టు ఆదేశించింది. ట్రయల్ కోర్టులో జరిగే విచారణకు హాజరుకాకుండా కూడా కేటీఆర్‌కు మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు గతంలో జారీచేసిన ఉత్తర్వులను గురువారం మరోసారి పొడిగించింది. కేటీఆర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్‌కు కూడా ఈ వెసులుబాటు కల్పించింది. తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన పోలీసులు, ఫిర్యాదుదారు అయిన నీటి పారుదల శాఖ సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వలిషేక్‌ను ఆదేశించింది. గత ఏడాది జూలై 26న మేడిగడ్డ బరాజ్‌ను కేటీఆర్, వెంకటరమణారెడ్డి, బాల్కసుమన్ సందర్శించారు. అనుమతి లేకుండా అక్కడ డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరించారని ఇంజినీర్ వలిషేక్ ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మహదేవ్‌పూర్ పోలీసులు బీఆర్ఎస్ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎలాంటి తప్పు చేయకున్నా తమపై నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్ దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీ నుంచి నీటిని ఎత్తిపోయకపోవడంతో వానకాలం వ్యవసాయ సీజన్‌కు నీటి కొరత ఏర్పడి రైతులకు నష్టం వాటిల్లిందని, వాస్తవాలను వెలికితీసేందుకు కేటీఆర్, ఇతర నాయకులు బ్యారేజీని సందర్శించారని పిటిషనర్ల తరఫు న్యాయవాది చెప్పారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేశారు.

### పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రోడ్డెక్కిన రైతులు



పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట వరలక్ష్మి జిన్నింగ్ మిల్లు సమీపంలో చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. సుమారు గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మార్కెట్ కార్యదర్శి రామాంజనేయులు, సీపీవో అక్కడికి చేరుకొని పత్తి కొనుగోళ్లు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. - చెన్నూర్ రూరల్

### హైవే అథారిటీ కార్యాలయం ముట్ట'ఢీ'



భారత్‌మాల హైవేలో పోతున్న భూములకు నష్టపరిహారం ఇవ్వాలని నిర్వాసితులు గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారుల కార్యాలయాన్ని ముట్టడించారు. నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గూడెబల్లూరు నుంచి మొదలుకొని లాల్‌కోట చౌరస్తా మీదుగా.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి భూ నిర్వాసితులు తరలివెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మాట్లాడుతూ ఆరేండ్ల కిందట 19 గ్రామాల నుంచి 3 వేల మంది భూమి సేకరించి రూపాయి కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**- మహబూబ్‌నగర్ అర్బన్**

## నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితుల ఆందోళన

- పరిహారం ఇవ్వకుండా ఖాళీ చేయిస్తున్నారని ఆగ్రహం

మర్రిగూడ, ఫిబ్రవరి 6 : నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం భూనిర్వాసితులు గురువారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తమకు పరిహారం చెల్లించకుండానే ఖాళీ చేయించాలని చూస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. సర్వస్వం కోల్పోయిన తమ పట్ల ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించడం సరికాదన్నారు. పూర్తిస్థాయిలో ప్లాట్లు, పరిహారం చెల్లించే వరకు గ్రామాన్ని విడిచేది లేదని స్పష్టంచేశారు.



శివన్నగూడెం ప్రాజెక్టు కట్టపై నిరసన తెలుపుతున్న నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు



సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో నీరులేక కళతప్పిన మైసమ్మ చెరువు

# మల్కపేట కాల్వ పారేదెప్పుడో?

- ఇప్పటికే వందెకరాల్లో ఎండిన పంటలు
- బోర్లు వేసినా దక్కని ఫలితం
- ఎల్లారెడ్డిపేట రైతుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 6 : దాదాపు పదేండ్లు నీళ్లు, కరెంటుకు ఇబ్బంది లేకుండా గడిపిన రైతులు ఇప్పుడు పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సరిగా కరెంటు రాక.. బోరుబావుల్లో నీళ్లు లేక.. కళ్లముందే ఎండిపోతున్న పంటలను చూసి కన్నీరు పెట్టుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్, రాజన్నపేట, కిష్టానాయక్‌తండా, గొల్లపల్లి, దేవునిగుట్టతండా, బాకుర్‌పల్లి తండాల్లో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. పదేండ్ల కాలంలో ఈ గ్రామాల్లోని ప్రతి చెరువు నిండుకుండలా మారి బోరుబావుల్లో పుష్కలమైన నీరు ఉండేది. 24 గంటల కరెంటు వచ్చేది. మల్కపేట రిజర్వాయర్ కాల్వలో పారే నీరు ఎక్కువై కట్టలు, మత్తడి తెంపిన రోజులు ఉండేవి. ఇప్పుడు అవన్నీ పోయి.. కరెంటు, పంట నీళ్ల కోసం నిద్రలేని రాత్రులు గడుపుతున్నట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి కాల్వలకు నీళ్లు విడిచి రాజన్నపేటలోని కొచ్చెరువు, తిమ్మాపూర్‌లోని మైసమ్మ చెరువు నింపాలని ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రమిచ్చినా నీళ్లు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అల్మాస్పూర్ నుంచి బాకుర్‌పల్లి వరకు కాల్వను ఆనుకుని 800 ఎకరాలు సాగవుతుండగా, నీరు రాక పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. కొచ్చెరువు, మైసమ్మ చెరువుల్లో నీళ్లు తగ్గి బోర్లు ఇంకిపోయాయని, కొత్తగా వేసినా ఫలితం లేదంటున్నారు. ఇప్పటికే 70 ఎకరాల్లో పంటలు ఎండిపోగా పది రోజుల్లో మిగతా పంటలూ ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

# పదేండ్లలో లేని నీటి కరువు ఇప్పుడెలా?

**కాల్వలు ఉన్నా నీరివ్వని అధికారులు.. వెయ్యి ఫీట్లు వేసినా చుక్కనీరు రాదె.. గ్రామాల్లో చక్కర్లు కొడుతున్న బోరు బండ్లు**

జనగామ రూరల్, ఫిబ్రవరి 6: జనగామ జిల్లా జనగామ మండలంలో గోదావరి కాల్వలు ఉన్నా నీళ్లు అడుగంటాయి. చుక్క నీరు రాకపోవడంతో చెరువులు ఎండిపోయి, బోరుబావుల్లోనూ నీరులేక పంటపొలాలు ఎండిపోతున్నాయి. కొద్దిగా పెట్టిన వరికి కూడా సరిపడా నీరులేక పొలాలు బీటలువారుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదైనా కాల్వల ద్వారా సాగునీటిని అందించాలనే ధ్యాస లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెయ్యి ఫీట్లు వేసినా బోర్లలో చుక్క నీరు వస్తలేదని రైతులు వాపోతున్నారు.

### జీవాలకు మేతగా పంట

కొందరు రైతులు విడుతల వారీగా పంటలకు నీరు అందిస్తున్నారు. మండలంలోని పెద్దరాంచర్ల, సిద్దెంకి, పెద్దపహాడ్, ఎర్రకుంట తండా, ఎల్లంల, పెంబర్తి ఓబుల్‌కేశ్వాపూర్, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో నీళ్లు అడుగంటాయి. పెద్దరాంచర్లకు చెందిన పొన్నాల ప్రభాకర్‌రెడ్డి, సిద్దెంకి గ్రామానికి చెందిన ముస్త్యాల వెంకటయ్య, బిట్ల రవీందర్‌రెడ్డి తదితర రైతుల పొలాలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. పంటలు ఎండిపోతుండటంతో రైతులు వాటిని జీవాలకు వదిలేస్తున్నారు.

### మూడెకరాలు ఎండిపోయింది

నాకు 4.20 ఎకరాలు భూమి ఉన్నది. అందులో ఎకరం పడావుగా ఉంది. 3.20 ఎకరాలు వరినాటు వేసిన. అందులో 20 గుంటలు పారుతుంది. మిగిలిన 3 ఎకరాలు ఎండిపోయింది. పక్కనే గోదావరి కాలువ నీరు రావడంతో గతంలో పొలం మొత్తం నాటు వేసిన. రెండు బోర్లలో ఒకటి ఎండిపోయింది.

**– పొన్నాల ప్రభాకర్ రెడ్డి, రైతు, పెద్దరాంచర్ల, జనగామ**

